సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 26 । మార్చి । 2024


నగరంలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. యువత ఉత్సాహంగా రంగులు జల్లుకున్నారు. రెయిన్ డ్యాన్స్‌తో ఆకట్టుకున్నారు. 8లో


రామ్మూర్తిపంతులుపేట ఆరాధ్య దైవం పైడిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా నిర్వహించారు. 8లో


ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం సోమ వారం భక్తులతో కిటకిటలాడింది. హోళిపౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8లో

ఫోర్జరీ, చీటింగ్.. ఇంకా



- ఉమ్మడి విశాఖలో కూటమిలోని ముగ్గురు ఎంపీ అభ్యర్థులపై ఆరోపణలు
- భూఆక్రమణకు పాల్పడిన విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి భరత్ ఫ్యామిలీ
- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌పై పలు కేసులు
- అరకు బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతపై బ్యాంక్ రుణాల ఎగవేత కేసు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు ఎంపీ స్థానాల్లో బరిలోకి దిగుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు పలు కేసులు ఎదుర్కొంటున్నారు. భూకబ్జా, ఫోర్జరీ, రుణాల ఎగవేత వంటి కేసులు వారిని వెంటాడుతున్నాయి. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌పై ఫోర్జరీ కేసు, అరకు బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి కొత్తపల్లి గీతపై బ్యాంక్ రుణాల ఎగవేత కేసు, విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ కుటుంబంపై భూఆక్రమణ కేసులు ఉన్నాయి. వీరిపై తవ్వే కొలదీ అవినీతి, ఆక్రమణలు బయటకు వస్తున్నాయి. ఇలా పలు ఆరోపణలు ఉన్న వీరు చట్టసభలకు పోటీ చేస్తుండడంపై జనాలు విస్తుపోతున్నారు. వీరు తీరు ఇప్పుడు 'ముగ్గురూ ముగ్గురే' అన్నట్లు ఉంది.

వెంటాడుతున్న గీతం భూ ఆక్రమణల కేసు



అక్రమాల పునాదులపై విశ్వ విద్యాలయాన్ని తన కుటుంబీకులు నిర్మిస్తున్నా.. ఆపకుండా ప్రోత్సహించిన చరిత్ర విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ది. అక్రమ కట్టడాలు, భూఆక్రమణలతోనే గీతంని విస్తరించారనే ఆరోపణలు నిజమని ప్రభుత్వాధికారుల స్వాధీనంతో నిరూపితమయ్యాయి. గతంలో ఆ వివాదాస్పద వ్యవహారాలన్నీ ప్రస్తుత గీతం వర్సిటీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఎం.భరత్‌ని వెంటాడుతున్నాయి. గీతం కళాశాల తొలుత పాతిక ఎకరాల్లో ఏర్పాటైంది. ఆ తర్వాత క్రమక్రమంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసుకుంటూ 110 ఎకరాల విస్తీర్ణంలో డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి చేరింది. ఈ సంస్థ ఆధీనంలో ఉన్న 35 ఎకరాల భూములను లీగల్‌గా కైవసం చేసుకునేందుకు అప్పటి కలెక్టర్ ద్వారా 2012 మే 28వ తేదీన ఎలినేషన్ ప్రతిపాదనలు పంపించగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాటు తొక్కిపెట్టింది. ఈ భూముల్ని దళిత విద్యార్థుల కళాశాల, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్, బలహీన వర్గాల గృహనిర్మాణం, అధికారులకు రెసిడెన్షియల్ క్వార్టర్స్, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ సెంటర్ ఇలా వివిధ ప్రభుత్వ అవసరాల కోసం కేటాయిస్తున్నట్లు 2014 ఫిబ్రవరి 26వ తేదీన అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేసినా.. గీతం యాజమాన్యం వాటిని వదల్లేదు. గీతం ఆక్రమించిన 40.52 ఎకరాల భూముల విలువ ఇప్పుడు రూ.500 కోట్ల పైమాటే. ఇక కేబినెట్ ఆదేశాలు, కోర్టు ఉత్తర్వులు ఎలా ఉన్నప్పటికీ ఈ భూములు 2019 వరకూ గీతం ఆధీనంలోనే ఉన్నాయి. గీతం మూర్తి చేసిన సంస్థాగత తప్పుల గురించి తెలిసినా.. తప్పు అని చెప్పకుండా.. ప్రోత్సహించిన భరత్‌ని.. ఆ పాపాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం 40 ఎకరాల వరకూ గీతం ఆక్రమిత భూముల్ని స్వాధీనం చేసుకుంది. అయినా.. తమదేం తప్పులేదంటూ భరత్ మొసలి కన్నీరు కారుస్తూ.. కబ్జా భూమిలో కొంత భాగం తన వర్సిటీలోనే ఉంచేసుకున్నారు.

రుణాల ఎగవేత నుంచి కుల అనర్హత కేసు వరకు..



2014లో వైఎస్సార్ సీపీ తరపున అరకు ఎంపీగా గెలుపొందిన కొత్తపల్లి గీత ప్రలోభాలకు లోనై కొద్ది రోజులు టీడీపీకి దగ్గరయ్యారు. 2018లో జనజాగృతి పేరిట రాజకీయ పార్టీని నెలకొల్పారు. 2019 ఎన్నికల అనంతరం ఆ పార్టీని బీజేపీలో విలీనం చేశారు. ఆమెపై పలు కేసు ఉన్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి రూ.42.79 కోట్ల లోన్ తీసుకుని ఎగవేత కేసులోనూ దోషిగా తేలిన ఆమెకు 2022లో సీబీఐ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ఆమె కొన్నాళ్ల పాటు జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై బయటకు వచ్చారు. అంతేకాకుండా గీత గిరిజన మహిళ కాదని, గిరిజనులకు కేటాయించిన అరకు ఎంపీ స్థానంలో ఆమె తప్పుడు కులధ్రువీకరణ పత్రంతో పోటీ చేసి గెలుపొందిందని ఆమె ప్రత్యర్థి హైకోర్టులో కేసులు దాఖలు చేశారు. 2024 జనవరిలో గీత ఎస్టీ కాదని రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. ఆమె హైకోర్టును ఆశ్రయించగా ప్రభుత్వ గెజిట్‌ను సస్పెండ్ చేసింది.

కడప నుంచి హైదరాబాద్ వరకు అదే తీరు



సీఎం రమేష్ కడప జిల్లా పొట్లదుర్తి గ్రామంలో జన్మించారు. ఓసీ వెలమ సామాజిక వర్గానికి చెందిన ఆయన టీడీపీ నుంచి రాజకీయ అరంగేట్రం చేశారు. చంద్రబాబుకు సన్నిహితంగా ఉంటూ 2012లో టీడీపీ రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయ్యారు. 2018లో రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా టీడీపీ నుంచి నామినేట్ అయ్యారు. 2019 జూన్ 20న బీజేపీలో చేరారు. ఈయన అక్రమాల బాగోతాలు అన్నీ ఇన్నీ కావు. 2019లో కడప జిల్లా ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో కారు డ్రైవర్‌తో కలిపి తనపై దాడి చేశారని ఎర్రగుంట్లకు చెందిన పడిగపాటి వెంకట సుదక్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీనిపై ఐపీసీ 323, 324 కింద కేసులు నమోదు చేశారు. చిత్తూరు జిల్లాలో సారా వ్యాపారాలు చేశారు. అదేవిధంగా 2014–19లో గండికోట ప్రాజెక్ట్ పెండింగ్ పనుల్లో అవకతవకలు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. అలాగే ఆయనపై హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫోర్జరీ కేసు నమోదైంది. సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ స్వాతి కంపెనీ ప్రధాన కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలతో బోగస్ సబ్ కాంట్రాక్టు ఒప్పందం చేసుకొని రూ.450 కోట్లు కొట్టేశారనీ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సినీ నటుడు వేణు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఐపీసీ సెక్షన్లు 420, 468, 471 కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఇది కోర్టులో ఉంది.

నృసింహ మహా యజ్ఞానికి నేడు అంకురార్పణ


ఉత్తరరాజగోపురం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యజ్ఞశాల


సింహాచలం: సింహగిరిపై సుదర్శన నారసింహ మహా యజ్ఞం నిర్వహణకు మంగళవారం అంకురార్పణ జరగనుంది. లోక కల్యాణార్థం వచ్చే నెల ఒకటో తేదీ వరకు జరిగే ఈ మహా యజ్ఞంను వైభవంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న విశాల స్థలంలో పెద్ద ఎత్తున యాగశాలను ఏర్పాటు చేశారు. ఐదు హోమగుండాలు, స్వామివారి ఉత్సవమూర్తులు, సుదర్శన పెరుమాళ్‌ను అధిష్ఠింపజేసేందుకు వేదికలు నిర్మించారు. సింహాచలం దేవస్థానం వైదికులతో పాటు ఏపీ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ రుత్వికులు సుమారు 60 మంది వరకు ఈ యజ్ఞంలో పాల్గొననున్నారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు ఏదో ఒక రోజు యజ్ఞం కోసం రూ.3 వేలు టికెట్ కొనుగోలు చేసి భక్తులు పాల్గొనవచ్చు. యజ్ఞంలో భాగంగా సుభద్రా కాంప్లెక్స్ మీదుగా ఉచిత, రూ.100, రూ.300 దర్శనాల క్యూలను ఉత్తర రాజగోపురం వైపు మళ్లించారు. ఉచిత ప్రసాద వితరణ కౌంటర్‌ను కూడా త్రిపురాంతస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేశారు. యజ్ఞశాలని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 1 వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశారు. యజ్ఞం సమాచారం కోసం భక్తులు 63038 00739, 93905 01082లలో సంప్రదించవచ్చు. www.aptemples.ap.gov.inలో వెబ్‌సైట్‌లో కూడా టికెట్లు పొందవచ్చు.

రోజుకో వాహనంపై తిరువీధి

ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రోజుకో వాహనంపై స్వామివారి తిరువీధి నిర్వహించనున్నారు. 27న శేష వాహనం, 28న సర్వజన మనోరంజని, 29న హనుమత్ వాహనం, 30న సూర్యప్రభవాహనం, 31న వెండి గరుడ వాహనంపై సింహగిరి మాడవీధుల్లో స్వామి విహరించనున్నారు. వచ్చేనెల 1న ఉదయం బంగారం పల్లకిలో తిరువీధి నిర్వహించనున్నారు.

అప్పన్నకు పెళ్లి కుదిరింది

- వచ్చే నెల 9న ఉగాది రోజు పెళ్లిరాట
- 19న వార్షిక కల్యాణోత్సవం


బుగ్గన చుక్కతో పెళ్లికొడుకుగా అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి

సింహాచలం: సింహాద్రి అప్పన్న స్వామికి పెళ్లి కుదిరింది. సింహగిరి నుంచి కొండ దిగువకు దిగొచ్చి తనకు పిల్లనివ్వాలని సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారిని స్వామి అర్థించాడు. ఏమిచూసి నీకు పిల్లనివ్వాలని తొలుత నిరాకరించిన పైడితల్లి అమ్మవారు.. ఆ తర్వాత స్వామికి ఉన్న వైభవాన్ని, భక్తజన సందోహాన్ని చూసి ఆశ్చర్యపోయింది. చివరకు పిల్లనివ్వడానికి అంగీకరించింది. దీంతో వచ్చే నెల 9న ఉగాది రోజు పెళ్లిరాట ఉత్సవం, 19న చైత్ర ఏకాదశిని పురస్కరించుకుని వార్షిక కల్యాణోత్సవానికి శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి సిద్ధమవుతున్నాడు.

ఘనంగా డోలోత్సవం

ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి డోలోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. తనకు పిల్లనివ్వాలంటూ సోదరి పైడితల్లి అమ్మవారిని స్వామివారు అర్థించే విధానాన్నే అడవివరం గ్రామస్తులు బొట్టినడిగే పున్నమి ఉత్సవం(డోలోత్సవం)గా అభివర్ణిస్తారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా సింహగిరిపై నుంచి పల్లకిలో మెట్ల మార్గం ద్వారా ఉదయం 7 గంటలకు తొలిపావంచా వద్దకు తీసుకొచ్చారు. స్వామిని ఊరేగింపుగా పైడితల్లి అమ్మవారి ఆలయం వద్దకు తీసుకెళ్లి హారతులు పట్టారు. తరువాత స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి ఉద్యాన వన మండపంలో ఏర్పాటు చేసిన డోలీలో అధిష్ఠింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. పూజలు చేసిన వసంతాలను అర్చకులు స్వామికి సమర్పించారు. అనంతరం డోలోత్సవం నిర్వహించి, వసంతాలను అర్చకులు భక్తులపై చల్లారు. స్వామికి పెళ్లికుదిరిన ఆనందంలో దేవస్థానం ఉద్యోగులు, భక్తులంతా ఒకరిపై ఒకరు వసంతాలను చల్లుకుని ఆనంద డోలికల్లో మునిగితేలారు. పెళ్లి కొడుకు అలంకరణలో తిరువీధిగా వచ్చిన అప్పన్న స్వామికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికి మంగళ హారతులిచ్చారు. తరువాత స్వామిని మళ్లీ పైడితల్లి ఆలయానికి తీసుకెళ్లి అక్కడి నుంచి సింహగిరికి తరలించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్టుబోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.


భక్తులకు రంగులు పంచుతున్న అర్చకుడు

ఆలీవ్ రిడ్లే తాబేళ్ల సంతానోత్పత్తికి చర్యలు

దాబాగార్డెన్స్: అంతరించిపోతున్న అరుదైన ఆలీవ్ రిడ్లే తాబేళ్ల సంతానోత్పత్తికి చర్యలు చేపడుతున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలీవ్‌రిడ్లే తాబేళ్లు తీర ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం అక్టోబర్, నవంబర్ నెలల్లో వలస వచ్చి గుడ్లు పెట్టి, వాటి సంతానాన్ని వృద్ధి చేసుకుంటాయన్నారు. మళ్లీ మే నెలలో వాటి పిల్లలతో సముద్రంలో చేరుకునే ప్రక్రియ ప్రతి సంవత్సరం విశాఖ బీచ్‌ల్లో జరుగుతుందని తెలిపారు. ఆర్కే బీచ్, సాగర్‌నగర్, చేపలుప్పాడ, పెదనాగమయ్యపాలెం బీచ్‌లలో మెకానికల్ బీచ్ క్లీనింగ్‌కు బదులు మే నెల చివరి వరకు మ్యానువల్ పద్ధతిలో పారిశుధ్య కార్మికులతో పరిశుభ్రత చర్యలు చేపడుతూ, తాబేళ్ల సంతానోత్పత్తికి జీవీఎంసీ కృషి చేస్తుందన్నారు. సందర్శకులు కూడా వ్యర్థాలను బీచ్‌లో పడేయకుండా సమీపంలోని డస్ట్‌బిన్లలో వేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

నలుగుర్ని కాపాడిన లైఫ్‌గార్డ్స్

- ఆర్కే బీచ్‌లో ఇద్దరు..
- అప్పికొండ బీచ్‌లో మరో ఇద్దరు..


యువకులతో లైఫ్‌గార్డ్స్

దాబాగార్డెన్స్/బీచ్‌రోడ్డు: జీవీఎంసీ పరిధి పలు బీచ్‌ల్లో మునిగిపోతున్న నలుగురు యువకులను లైఫ్‌గార్డ్స్ కాపాడారని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జోన్–4 పరిధి ఆర్కేబీచ్, జోన్–6 పరిధి అప్పికొండ బీచ్‌లో హోలీ సందర్భంగా సోమవారం బీచ్ స్నానానికి సముద్రంలో దిగి మునిగిపోతున్న వారిని లైఫ్‌గార్డ్స్ రక్షించి ప్రాణాలు కాపాడారని తెలిపారు. రైల్వే న్యూకాలనీకి చెందిన కౌశిక్, బషీర్, తుంగ్లాంకు చెందిన సన్నీకుమార్, గోల్ కుమార్‌లు కళాశాల విద్యార్థులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పాండురంగాపురం, అప్పికొండ బీచ్ సమీపాల్లో ఆటవిడుపుగా స్నానాలకు బీచ్‌లో దిగి ప్రమాదవశాత్తు మునిగిపోతున్న వారిని జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ హరీష్, నవీన్, అరవింద్, అచ్చన్న, కిషోర్, వెంకటేష్, తాతారావుతో పాటు పోలీస్ పెట్రోలింగ్ గణపతి తదితరులు వారిని కాపాడి ఒడ్డుకు చేర్చారని, వీరిలో ఒకరికి సీపీఆర్ జరిపి వెంటనే 108 ద్వారా కేజీహెచ్‌కు తరలించారని, అందరూ ప్రాణాలతో బయటపడ్డారని కమిషనర్ తెలిపారు.

రేపటి నుంచి అంతర్ జిల్లా క్రీడాపోటీలు

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అంతర జిల్లా స్థాయి క్రీడా పోటీల షెడ్యూల్ జారీ అయినట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. ఈ నెల 27, 28 తేదీలలో స్కేటింగ్ అండర్ 11,14 బాలబాలికలకు తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా పోటీలు ఉంటాయన్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో స్కేటింగ్ అండర్–17 బాలబాలికలకు ఇదే వేదిక వద్ద పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో మోడర్న్ పెంటాథ్లాన్ (సిమ్మింగ్) పోటీలు అండర్ 17 బాలబాలికలకు జరుగుతాయన్నారు. ఈ విభాగంలో పాల్గొనేవారు స్కూల్ గేమ్స్ సెక్రటరీకి 9000019048 ఫోన్‌లో సంప్రదించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 30,31 తేదీల్లో పవర్ లిఫ్టింగ్ పోటీలు అండర్–17 బాలబాలికలకు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు **జిల్లా పరిషత్ ఉన్నత పాఠ**శాలలో జరుగుతాయని **పేర్కొన్నారు.**

'విద్య'యీ భవ

ఉన్నత చదువుకు భరోసా

- **జగనన్న విద్య, వసతి దీవెనతో అండ**
- **జిల్లాలో 49,427 వేల మంది విద్యార్థులకు మేలు**
- పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ధైర్యంగా చదువులు
- నాలుగన్నరేళ్లలో రూ.625.41 కోట్ల సాయం
- పేద విద్యార్థులకు విదేశాల్లో ఉచితంగా చదువు



విశాఖ విద్య/భీమునిపట్నం/మురళీనగర్: జగనన్న విద్య, వసతి దీవెన పథకాలు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసాగా నిలుస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చదువులకు ఆటంకం లేకుండా ఏటా క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తోంది. జిల్లాలో 49,427 వేల మంది విద్యార్థులకు నాలుగున్నరేళ్ల కాలంలో రూ.625.41 కోట్లు ఆర్థిక సాయం అందించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ఈబీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు అర్హతే కొలమానంగా ఉన్నత చదువులకు అయ్యే పూర్తి ఖర్చు ప్రభుత్వమే భరిస్తోంది. ప్రభుత్వ గుర్తింపు ఉన్న 275 విద్యా సంస్థల్లో డిప్లమో, డిగ్రీ, ఇంజనీరింగ్, పోస్టు గ్రాడ్యుయేషన్ వంటి కోర్సులు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా చదువుకునే అవకాశం కల్పిస్తోంది.

వసతి దీవెనతో ఆర్థిక దన్ను

పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం కాలేజీలకు చెల్లించాల్సిన ఫీజు మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. అంతేకాకుండా విద్యార్థులకు ఆర్థికంగా భరోసాగా నిలిచేలా వసతి దీవెన కూడా అందిస్తోంది. ఐటీఐ కోర్సు చేస్తున్న విద్యార్థులకు ఏడాదికి రూ. 10 వేలు, పాలిటెక్నిక్, ఇతర డిప్లమో కోర్సుల వారికి రూ.15 వేలు, డిగ్రీ ఆపై కోర్సుల చదివే విద్యార్థులకు రూ. 20 వేలు చొప్పున జగనన్న వసతి దీవెన పథకం కింద అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుండటంతో విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.


దీవెన చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున(ఫైల్)

నాడు ఏ కోర్సుకైనా రూ.35 వేలు మాత్రమే..

దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని టీడీపీ ప్రభుత్వ హయాం కూడా కొనసాగించారు. అయితే ఏ కోర్సు చదివినా, ఏడాదికి రూ.35 వేలు మాత్రమే ఇచ్చారు. అది కూడా సవ్యంగా ఇవ్వకపోగా, ఇచ్చే వాటిని కూడా కాలేజీలకు చెల్లించటంతో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యేవి. తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు సొంతంగా ఫీజు చెల్లించాల్సిన దుస్థితి నాడు ఉండేది.

విదేశాల్లోనూ చదువులు ఫ్రీ

విదేశాల్లో చదువుకునే వారికి సైతం ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. జగనన్న విద్యాదీవెన పథకం కింద ప్రపంచ వ్యాప్తంగా టాప్ 50 యూనివర్సిటీల్లో సీటు పొందే అర్హులైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజును ప్రభుత్వం చెల్లిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకైతే రూ.1.25 కోట్లు, ఇతరులకు రూ. కోటి వరకు మంజూరు చేస్తోంది.

సంవత్సరం	విద్యాదీవెన పొందిన విద్యార్థులు	మంజూరైన రూ.మొత్తం	వసతి దీవెన పొందిన విద్యార్థులు	మంజూరైన రూ.మొత్తం
2019-20	41,913	110,48,84,249	39,549	36,87,92,500
2020-21	49,204	97,52,68,301	49,332	46,10,22,500
2021-22	49,090	120,25,51,441	49,427	44,90,82,500
2022-23	45,326	93,41,66,638	45,267	41,11,35,000
2023-24 (క్వార్టర్)	44,117	34,72,64,615	-	-
మొత్తం	49,205	456,41,35,244	49,427	169,00,32,500

సీఎం సహకారంతోనే చదువుతున్నా



మాది భీమిలి. **ఇద్దరు అక్కలు ఉన్నారు. నాన్న ఎర్నింటి అప్పారావు గూడ్స్ వ్యాన్ నడువుతారు. ఇంట్లో ఆర్థిక పరిస్థితి** వల్ల **చదువు ఆగిపోతుందని** బాధపడ్డాను. అమ్మ **ఒడి పథకం వల్ల ఇంటర్** గట్టెక్కిన నాకు ఇక డిగ్రీ చదువుకునే అవకాశం ఏమాత్రం కనబడలేదు. జగనన్న విద్య దీవెన రూపంలో అదృష్టం దక్కింది. తద్వారా నాకు చదువుకునే అవకాశం లభించింది. బీఎస్సీ ఎలక్ట్రానిక్స్‌లో చేరి బాగా చదువుకుంటున్నాను. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి మా కుటుంబమంతా ఆయనకు రుణపడి ఉంటాం.

– ఎర్నింటి జయసాయి చంద్రిక, బీఎస్సీ ఎలక్ట్రానిక్స్

వసతి దీవెన ఆధారమైంది..



మేము 13 ఏళ్ల క్రితం విశాఖపట్నం వచ్చి 49వ వార్డు సత్యానగర్‌లో అద్దె ఇంటిలో ఉంటున్నాం. నా భర్త లండా దాసు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మాకు ఇద్దరు కొడుకులు. వీరిద్దరూ ఇప్పుడు ట్రిబుల్ ఐటీ చదువుతున్నారు. వీరికి జగనన్న వసతి దీవెన ద్వారా ఏడాదికి రూ.లక్ష మంజూరవుతోంది. ఇంత వరకు రూ.3.50 లక్షలు మంజూరైంది. ప్రస్తుతం మేమున్న స్థితిలో ఈ ఫీజు చెల్లించుకోవడం కష్టమయ్యేది. మాలాంటి పేదవారు సంవత్సరానికి లక్ష రూపాయలు పెట్టాలంటే మాటలు కాదు. జగననన్న వసతి దీవెన మా పిల్లల చదువుకు ఆధారమైంది. జగనన్న చేసిన మేలు మరిచిపోలేం.

– లండా పైడిరాజు, విద్యార్థి తల్లి సత్యానగర్, 49వ వార్డు

జీవితాంతం రుణపడి ఉంటాం..



నేను బీటెక్ ద్వితీయ సంవత్సరం, నా తమ్ముడు శామ్యూల్‌రాజ్ పాలిటెక్నిక్ చదువుతున్నాం. మా నాన్న వాచ్ మెకానిక్‌గా ఉన్నారు. ఆదాయం అంతంత మాత్రమే. అది కుటుంబ పోషణకే సరిపోని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ఉన్నత చదువులు కష్టం కానీ జగనన్న విద్య దీవెనతో భరోసా దొరికింది. మా అన్నదమ్ములిద్దరికి ఫీజుల కింద రూ 2.15 లక్ష వరకు క్రమం తప్పకుండా అందింది. ఇంటి పెద్దగా నిలిచి మా చదువులకు సహకరించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– సత్తరపు జెస్సీ మాధురి, బీటెక్ సెకండియర్, భీమిలి

ఒక్క రూపాయి ఖర్చులేకుండా చదువులు

మాది కాకినాడ జిల్లా పత్తిపాడు. నాకు ఆరేళ్ల వయసు అప్పుడు నాన్న చనిపోయారు. అమ్మ ఇంటి వద్ద టైలరింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చింది. మమ్మల్ని బాగా చదివించాలనేది అమ్మ తపన. ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆగిపోతుందేమోనని ఆందోళన ఉండేది. జగనన్న విద్య, వసతి దీవెన పథకాల ధైర్యంతో విశాఖలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లమో ఇన్ ఫార్మసీ కోర్సులో చేరాను. తమ్ముడు సూర్యతేజకు అమ్మ ఒడి డబ్బులు వచ్చాయి. వాడు విశాఖలోని కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీలో డిప్లమో కోర్సు చేరాడు. రూపాయి ఖర్చులేకుండానే మా ఉన్నత చదువులు కొనసాగుతున్నాయి. జగనన్న ప్రభుత్వం చేసిన మేలు, బహిరంగంగానే చెబుదామని ముందుకొచ్చే వాళ్లను కొంతమంది సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తుండటం బాధగా ఉంది. అందుకే వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారానే సమాధానం చెప్పాలని ఉంది.

– జన్నెపల్లి సుదర్శిని, డీ ఫార్మసీ

జగనన్న అండగా..



మాది ఆనందపురం మండలం కుసులవాడ. విశాఖలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ చదువుతున్నాను. అమ్మ సూర్యకుమారి ఇంట్లో టైలరింగ్ చేస్తుంది. నాన్న ఆనందీశ్వర్రావు ఆటో డ్రైవర్. వాళ్లకు వచ్చే డబ్బులు కుటుంబ అవసరాలకే సరిపోతాయి. ఉన్నత చదువులు ఎలా అనే దిగులు ఉండేది. జగనన్న ప్రభుత్వం మాలాంటోళ్ల కోసం అమలు చేసిన పథకాలు కొండంత ధైర్యాన్ని ఇచ్చాయి. ఇంటర్ చదువుతున్న తమ్ముడు సాయికిరణ్‌కు అమ్మ ఒడి డబ్బులు వస్తున్నాయి. అమ్మకు చేయూత. నాన్నకు వాహనమిత్ర డబ్బులు డబ్బులు పడుతున్నాయి. విద్యాదీవెనతో నేను ఫ్రీగానే చదువుకుంటున్నాను. ఇలాంటి ప్రభుత్వం ఉంటేనే మాలాంటోళ్ల బతుకులు బాగుంటాయి.

– బొచ్చు లావణ్య, బీఎస్సీ, కంప్యూటర్

చదువు అంతా ఫ్రీ



మాది విజయనగరం జిల్లా గరివిడి మండలం దేవాడ గ్రామం. అమ్మ మంగమ్మ, నాన్న రమణ కంపెనీలో పనికి వెళ్తేనే కుటుంబం గడిచేది. ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువులు ఎలా అని భయపడేవాళ్లం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నాకు అమ్మ ఒడి ఇచ్చింది. ఇంటర్ రెండేళ్లు కూడా అమ్మ ఒడి డబ్బులు అందాయి. డిగ్రీ చదువు కూడా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సాగుతోంది. అన్నయ్య డిగ్రీ పూర్తి చేసి గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. నేను పోలీసు కావాలన్నదే అమ్మ కోరిక. ఉద్యోగ నోటిఫికేషన్లు కూడా ఇప్పుడు బాగానే వస్తున్నాయి. ప్రభుత్వం ఉచితంగా కోచింగ్ కూడా ఇస్తుందని మా మేడమ్స్ చెప్పారు. గ్రూప్–1 ద్వారా డీఎస్పీ పోస్టు సాధించాలనే లక్ష్యంతో చదువుతున్నాను.

– మామిడి దేవి, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్

నేడు యూకే డిప్యూటీ హై కమిషనర్ రాక

బీచ్‌రోడ్డు: యూకే డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ విశాఖ నగరానికి రానున్నారు. ఆయన మంగళవారం హైదరాబాద్ నుంచి విమానంలో ఉదయం 10.50 గంటలకు విశాఖ చేరుకోనున్నారు. విశాఖలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. తిరిగి బుధవారం రాత్రి 8 గంటలకు విమానంలో హైదరాబాద్ వెళతారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



‘రంగు’లాట

బీచ్‌రోడ్డు: నగరంలో సోమవారం పలుచోట్ల చిన్నా, పెద్ద, యువత అంతా ఇంద్రధనస్సు వర్ణాలలో తడిసి ముద్దయ్యారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని డీజే ధ్వనుల నడుమ సంగీతానికి లయబద్ధంగా నృత్యాలు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. నగరంలో ప్రధానంగా ఆర్కే బీచ్‌తో పాటు ప్రైవేటు ఆర్గనైజర్స్ ఏర్పాటు చేసిన హోలీ ఈవెంట్‌లో పాల్గొన్నారు. రెయిన్ డ్యాన్స్‌లతో సందడి చేశారు. యువతీయువకులు రంగుల్లో తడిసిముద్దయ్యారు.



డ్యాన్స్ చేస్తూ..



కలర్‌ఫుల్ ఈవెంట్..



రంగు పడింది



హ్యాపీ హోలీ..



ఎన్నెన్నో వర్ణాలు..



ఒళ్లంతా కలరింతా..

జూలో జిరాఫీల కనుమరుగు

- బేకన్ మృతితో ఖాళీగా ఎన్‌క్లోజర్
- జంతుప్రేమికుల ఆవేదన

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో జిరాఫీలు కనుమరుగయ్యాయి. ఒక్కొక్కటిగా మృత్యువాత పడ్డాయి. దీంతో జూలో వాటిఎన్‌క్లోజరు బోసిపోయింది. జూ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఏనుగులు, పులులు, కోతులు, వివిధ రకాల పక్షులు ఉండేవి. కానీ జిరాఫీ, జీబ్రాలు ఉండేవికాదు. దీంతో 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జూ పార్కుల డైరెక్టర్ మల్లికార్జున ప్రోత్సాహంతో అప్పటి జూ క్యూరేటర్ రామలింగం కృషితో మలేషియా దేశంలో నెగరా జూ నుంచి మూడు జిరాఫీలను తీసుకురావడానికి సీజెడ్ఏ నుంచి అనుమతులు లభించాయి. దీంతో 2013లో మలేషియా దేశం నుంచి మూడు జిరాఫీలను విశాఖ జూకి తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. వాటిలో రెండు మగవి, ఒకటి ఆడది. సముద్ర మార్గం నుంచి ఓడలో తీసుకొస్తుండగా మార్గమధ్యలోనే ఓ మగ జిరాఫీ ప్రాణాలు కోల్పోయింది. దీంతో మిగిలిన జత జిరాఫీలను అధికారులు విశాఖ జూకి తీసుకొచ్చారు. జిరాఫీల పునరుత్పత్తిలో భాగంగా కొన్నాళ్లకు ఆ రెండింటికి మేటింగ్ నిర్వహించారు. దాని ఫలితంగా మే అనే ఆడ జిరాఫీ ఓ మగ పిల్లకు జన్మనిచ్చింది. ఆ పిల్ల జిరాఫీ రెండు వారాల్లో మృత్యువాతపడింది. మరో మూడేళ్ల అనంతరం ఆ ఆడ జిరాఫీ మళ్లీ గర్భందాల్చింది. ఈసారి దాని కడుపులో ఉండగానే పిల్ల మృతిచెందింది. పుట్టిన జిరాఫీ పిల్లలు నిలవలేదు సరకదా ఈసారి పెద్ద జిరాఫీలే కాలం చేశాయి. మే అనే ఆడ జిరాఫీ గత ఏడాది మే 17న అనారోగ్యంతో మృతి చెందింది. పోస్టుమార్టం రిపోర్టులో దీని పొట్టలో 16 కిలోల ఇసుక ఉన్నట్లు జూ వైద్యులు నిర్ధారించి ఆశ్చర్యపోయారు. అప్పటి నుంచి ఒంటరిగా ఉన్న బేకన్ అనే మగ జిరాఫీ ఆదివారం అర్ధరాత్రి కార్డియక్ పల్మనరీ ఫెయిల్యూర్ కావడంతో మృతి చెందింది. దీంతో ఈ జూ పార్కులో నాలుగు జిరాఫీలు మృత్యువాత పడినట్లయింది. దీంతో జంతు ప్రేమకులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ వన్యప్రాణులను నాణ్యమైన వైద్యం అందుతుందో లేదోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



జూలో మృతి చెందిన జిరాఫీలు మే, బేకన్(ఫైల్)..

కోల్‌కతా జూ నుంచి జత జిరాఫీలను తీసుకొస్తాం

విశాఖ జూలో ఉన్న మగ జిరాఫీ ఆదివారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. ప్రస్తుతం జూలో జిరాఫీలు లేవు. కొద్ది నెలల క్రితం నుంచి కోల్‌కతాలో అలీపూర్ జూ పార్కు నుంచి జత జిరాఫీలను ఇక్కడకు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. దీని కోసం సీజెడ్ఏ(సెంట్రల్ జూ అథారిటీ)కి ప్రతిపాదనలు పంపించాం. వాటిని తీసుకురావడానికి త్వరలో అనుమతులు వచ్చే అవకాశం ఉంది.

–నందనీ సలారియా, జూ క్యూరేటర్

‘ఫల’స్వాగతం

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీకి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు వెంకటాపురంలో ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. వెంకటాపురంలో ప్రచారంలో పాల్గొన్న వారికి మూడు గుళ్ల వద్ద యాపిల్ పండ్ల భారీ మాలను క్రేన్ సాయంతో వేసి స్వాగతం పలికారు. అక్కడ నుంచి నందమూరినగర్, శ్రీసాయినగర్, జనతాకాలనీ, పద్మనాభనగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు.



ఇసుక కొండకు పోటెత్తిన భక్తులు

దాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకొండ (బాబాజి కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. హోళీపౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వాహణాధికారి బుద్దా నాగ జగదీష్ పర్యవేక్షించారు.



ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

డ్రైవర్ల మధ్య ఘర్షణ

అక్కిరెడ్డిపాలెం: ఇద్దరు డ్రైవర్ల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక ఏసీపీ టి.త్రినాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటోనగర్‌లోని దక్షా షిప్పింగ్ కంపెనీలో విజయనగరం జిల్లా ఎల్‌కోట సమీపం గొలగాం గ్రామానికి చెందిన లంకా గణపతి రావు, అదే జిల్లా గంట్యాడకు చెందిన రాంబాబు ఒకే లారీకి షిఫ్ట్ డ్రైవర్లగా పనిచేస్తున్నారు. గణపతి రావు షిఫ్ట్ ప్రకారం డ్యూటీ చేస్తుండగా రాంబాబు మాత్రం నిర్లక్ష్యంగా విధులకు హాజరవుతున్నాడు. దీంతో గణపతిరావుపై భారం పడుతోంది. ఆదివారం షిఫ్ట్ ప్రకారం రాంబాబు డ్యూటీ చేయాల్సి ఉంది. అయితే అతను రాకపోవడంతో గణపతిరావు ఫోన్‌లో గట్టిగా నిలదీశాడు. పదేపదే డ్యూటీకి రాకపోతే..ఆ భారం తనపై పడుతోందని రాంబాబుకు చెప్పగా..ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సోమవారం షిప్పింగ్ కంపెనీ లారీ పార్కింగ్ ప్రదేశానికి రాంబాబు చేరుకోగా..అక్కడే ఉన్న గణపతికి మధ్య మళ్లీ వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరు డ్రైవర్లు ఘర్షణకు దిగారు. ఈ సమయంలో రాంబాబు తనతో తెచ్చుకున్న చాకుతో గణపతిపై దాడి చేశాడు. గణపతి ఛాతీ నుంచి కడుపు వరకు, భుజంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తోటి డ్రైవర్లు గణపతిని చికిత్స నిమిత్తం గాజువాకలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

తన తప్పును కప్పి పుచ్చుకునేందుకు రాంబాబు పక్కనే ఉన్న గోడకు తలతో కొట్టుకున్నాడు. గాయంతో చుక్కవానిపాలెంలో ఉన్న యూపీహెచ్‌లో చికిత్స చేయించుకునేందుకు వెళ్లగా.. దాడి జరిగింది కాబట్టి కేజీహెచ్‌కు వెళ్లాలని అక్కడ వైద్యులు సూచించారు. రాంబాబు కేజీహెచ్‌కు వెళ్తుండగా గాజువాక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తీవ్ర గాయాలపాలైన గణపతి ఇచ్చిన వాగ్మూలం ప్రకారం గాజువాక సీఐ శ్రీనివాసరావు వివరాలు సేకరించారు. రాంబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



తీవ్ర గాయాపాలైన లంకా గణపతిరావు

వైద్య శిబిరంలో ఎన్నికల ప్రచారం

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు మర్రిపాలెం మహారాణి వీధిలో జింసర్ ఆస్పత్రి, గీతం దంత ఆస్పత్రి సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని టీడీపీ, జనసేన నాయకులతో కలిసి విశాఖ ఉత్తర బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజు ప్రారంభించడం ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు కిందకు వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి భరత్‌కు చెందిన గీతం దంత వైద్యశాల సిబ్బందితో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారి ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని ప్రజలే చెబుతున్నారు. కంచరపాలెం–మర్రి పాలెం ప్రాంతాల ఓటర్లను మభ్యపెట్టే విధంగా సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎన్నికల హడావుడి స్పష్టంగా కనిపించింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి వైద్యశిబిరంలో ప్రచారాలు చేయడంపై ఆర్‌వో చర్యలు తీసుకోకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



మందులు పంపిణీ చేస్తున్న విష్ణుకుమార్‌రాజు

వైభవం..తొలేళ్ల సంబరం



అమ్మవారి ఘటాలు ఊరేగిస్తున్న భక్తులు

కంచరపాలెం: కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట ఆరాధ్య దైవం పైడిమాంబ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామాధ్యక్షుడు దాడి గోవింద్, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల వెంకటరావు నేతృత్వంలో తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ ఉత్సవంలో వందలాది అమ్మవారి ప్రతిమలను రామ్మూర్తి పంతులుపేట నుంచి జ్ఞానాపురం, జగదాంబ కూడలి, కాన్వెంట్ కూడలి మీదుగా తిరిగి అమ్మవారి మూలవిరాట్, ఆర్‌పీపేట రైల్వే గేటు వద్దకు తీసుకొచ్చారు. సుమారు 298 అమ్మవారి ప్రతిమలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మంగళవారం ప్రధాన ఉత్సవ జరగనున్నదని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

గోపాలపట్నం: ఎయిర్‌పోర్టు జంక్షన్ వద్ద టిప్పర్ ఢీకొట్టిన ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నందమూరినగర్‌కు చెందిన మొల్లేటి ఉట్టిబాబు (36) రాత్రి సమయాల్లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. భార్య మొల్లేటి ఆశ కేజీహెచ్‌లో అవుట్ సోర్సింగ్ నర్స్‌గా పనిచేస్తోంది. ఆదివారం రాత్రి ఆమెను కేజీహెచ్‌లో దించాడు. ఉదయాన్ని షీలానగర్‌కు బేరం రావడంతో వెళ్లి తిరిగి వస్తుండగా ఎయిర్‌పోర్టు జంక్షన్ వద్ద వెపుక నుంచి వచ్చిన టిప్పర్ ఉట్టిబాబును ఢీకొనడంతో రోడ్డుపై పడిపోగా..టిప్పర్ అతనిపైనుంచి వెళ్లిపోయింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి తల్లి, భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కేసు నమోదు చేసిన ఎయిర్‌పోర్టు పోలీసులు మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.



మృతుడు ఉట్టిబాబు